[illegible]

ఓ మాట...

[illegible]

చదువులు - కొత్తదారులు-2

మంచిబడి

డా॥ జాన్‌హోల్ట్

అనువాదం: [illegible]

జన విజ్ఞాన వేదిక
మంచి పుస్తకం

చదువులు - కొత్తదారులు-2
మంచి బడి: జాన్‌హోల్ట్
హిందీమూలం: అచ్ఛా స్కూల్ (హిందీలోకి అనుసృజన పుష్పా అగర్వాల్)
అనువాదం: టి.నరసింహులు
బొమ్మలు: పంకజ్ ఝా
హిందీలో ఈ పుస్తకమాల సంపాదకులు: అరవిందగుప్తా
తెలుగులో ఈ పుస్తకమాల సంపాదకులు: కె.సురేష్
© భారత జ్ఞాన విజ్ఞాన సమితి

కంపోజింగ్: ఆర్.జె. గ్రాఫిక్స్
చిక్కడపల్లి, హైదరాబాద్-500 020.
ఫోన్: 661 0373

ముద్రణ: చరిత గ్రాఫిక్స్
చిక్కడపల్లి, హైదరాబాద్-020.
ఫోన్: 760 7361

వెల: రూ. 8.00
ప్రచురణ కాలం: సెప్టెంబరు, 2002

ప్రచురణ, ప్రతులకు:
జన విజ్ఞాన వేదిక
జి.మల్యాద్రి, కన్వీనర్ ప్రచురణల విభాగం
162, విజయలక్ష్మినగర్
కొత్తూరు పోస్ట్, నెల్లూరు - 524 004.
ఫోన్: 0861-305303

మంచి పుస్తకం
'వాసన్', 12-13-452, వీధి నెం.1
తార్నాక, సికింద్రాబాద్ - 500 017.

జాతీయ సాక్షరతా మిషన్ సహాయంతో భారత జ్ఞానవిజ్ఞాన సమితి, న్యూఢిల్లీ ప్రజల చదువుల ఉద్యమం (జనవాచన్ ఆందోళన్) పేరుతో బాలల పుస్తకమాలగా దాదాపు 60 పుస్తకాలు ప్రచురించింది. గ్రామీణ ప్రజలు, పిల్లల్లో చదవటంపట్ల ఆసక్తి కలిగించటం ఈ పుస్తకాల ఉద్దేశం. వాటిల్లోనుంచి చదువులు, విద్యావేత్తలు, కొన్ని ప్రయోగాత్మక బడుల గురించిన ఆరు పుస్తకాలను ఎంపికచేసి 'చదువులు - కొత్తదారులు' పేరుతో ప్రచురిస్తున్నాం. ఈ ఆరు పుస్తకాలు ప్రత్యేకించి 'చదువు'కి సంబంధించి ఆసక్తి ఉన్న ఉపాధ్యాయులు, విద్యావేత్తలు, తత్వవేత్తలు, కార్యకర్తలు, తల్లిదండ్రులను ఉద్దేశించి ప్రచురిస్తున్నాం.

మంచి బడి

జాన్ హోల్ట్

మంచి బడి

పిల్లలకు, పెద్దలకు మధ్య ఆత్మీయ సంబంధాలున్న బడులలో డెన్మార్క్‌లోగల 'న్యూ లిటిల్ స్కూల్' ఒకటి. పెద్దలతో నిర్భయంగా, నిజాయితీగా పిల్లలు వ్యవహరిస్తారు కాబట్టి ఇక్కడ నిజమైన విద్య లభించే వీలుంది.

ఈ బడిలో పేగీ హ్యూస్ రెండు సంవత్సరాలు పని చేశాడు. దీని మీద 'వి హేవ్ టు కాల్ ఇట్ ఎ స్కూల్' (We have to call it a school) అన్న సినిమా తీశాడు. బడి మొదలు పెట్టినపుడు ఒక అధ్యాపకుడు "మనం దీనిని బడి అనాలి. అలా అనకపోతే పిల్లలు ఇక్కడికి రారు" అన్నాడు. పిల్లలు బడికి వేళకు రావలసి ఉంటుంది కానీ ఇక్కడ బడిలాగా అనిపించదు. ఇక్కడ ఎట్లువంటి 'చదువు' ఉండదు. వాస్తవానికి ఇది 'పని చేసే' స్థలం. ఈ బడిలో 6–14 సంవత్సరాల వయస్సు పిల్లలు 85 మంది ఉన్నారు. వీరిలో సహకార గుణం, ఆత్మవిశ్వాసం, సంతోషం వెల్లి విరుస్తుంటుంది. ఆరుగురు పెద్ద వాళ్ళుకూడా ఉన్నారు.

ఈ పిల్లలు తమకు నచ్చిన విధంగా ఉంటూ బడిలో స్వేచ్ఛను అనుభవిస్తారు. అయితే అందరికీ ఉండే నియమాలు వాళ్ళకీ వర్తి

స్తాయి. ఉదాహరణకు: ఇంకొకరిని కొట్టగూడదు; ఇతరుల ఆస్తికి, సామాజిక సంపదకు నష్టం కల్గించకూడదు. విద్యార్థులు తమ సమయాన్ని తమకు నచ్చినవిధంగా, నచ్చిన వాళ్ళతో గడపవచ్చు. అధ్యాపకులు ఇందుకు అనువైన పరిస్థితులు కల్పిస్తూ పిల్లల్ని గమనిస్తూ ఉంటారు. పిల్లలకు ఇష్టమైన పనులు రూపొందించటానికి అవసరమైన సామగ్రి సమకూరుస్తుంటారు. పిల్లలతో కలిసి పనిచేస్తారు. పిల్లలు కోరినట్లయితే వారికి సహకరిస్తారు. పిల్లలు తాము తయారు చేసిన వస్తువులు చూపించాలనుకున్నా, ప్రశ్నలు అడగాలనుకున్నా, వారితో మాట్లాడాలనుకున్నా, వారితో గడపాలనుకున్నా అధ్యా



పకులు వారికి అందుబాటులో ఉంటారు. విద్యార్థులు స్వయంగా ఎంచుకున్న, లేదా ఇతరులు సూచించిన పనులు చెయ్యమని అధ్యాపకులు పిల్లల్ని భయపెట్టరు, బెదిరించరు, మందలించరు, ప్రలోభపెట్టరు.

ఈ బడిలో విద్యాపరమైన కార్యక్రమమంటూ ఏమీ ఉండదు. తరగతులుండవు. పాఠ్యప్రణాళిక ఉండదు. ముందుగా నిర్ధారించిన మార్గాలూ ఉండవు. పరీక్షలు, మార్కులు, గ్రేడులూ వంటివి ఏవీ ఉండవు. రిపోర్టులుండవు. పిల్లల తల్లి దండ్రులు లేదా సంరక్షకులతో సమావేశాలుండవు. తమ పిల్లల గురించి మాట్లాడటానికి,

తెలుసుకోటానికి ఒకవేళ ఎవరైనా సంరక్షకులు బడికి రావాలనుకుంటే రావచ్చు.

ఇక్కడ చదువుకు సంబంధించి పిల్లలపై ఎటువంటి వత్తిడి ఉండదు. ఇతర కొత్తపంథా బడులలో మాదిరి 'దీనిని ఇలా చేద్దామా', లేదా 'ఇలా చెయ్యి వచ్చని నువ్వు అనుకోవటం లేదా' వంటివి ఇక్కడ ఏమాత్రం ఉండవు. తల్లి దండ్రుల లేదా సంరక్షకుల మెప్పుకోసం పిల్లలు చేసిన పనులను ఇక్కడ ప్రదర్శించరు. పిల్లలు తయారుచేసిన బొమ్మలు, చిత్రాలు, వైజ్ఞానిక నమూనాలు, కళాత్మక వస్తువులను పాఠశాల సందర్శకులకు చూపించరు. పిల్లల సృజనాత్మకతని తెలియచెయ్యటం కోసం నృత్యం, నాటకం లాంటి కార్యక్రమాలను బయటి ప్రపంచం కోసం ప్రదర్శించరు.

దీనికి భిన్నంగా అమెరికాలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావించే ఒక బడి తన పత్రికలో పిల్లల యాత్రా అనుభవాలను ప్రచురించింది: ఓడనుంచి సామాను దించడాన్ని చూడడం, వాటర్ వర్క్స్ చూడడం, రైల్వేస్టేషనులో ఒక వ్యక్తిని ఇంటర్వ్యూ చేయడం వంటివి ఇందులో ఉన్నాయి. యాత్రలకు సంబంధించి పిల్లలకు ప్రణాళిక ఉందనీ, ఇతరులను ఇంటర్వ్యూ చేయడానికి వారు ప్రశ్నలు తయారు చేసుకున్నారనీ ఇందులో పేర్కొన్నారు. ఈ యాత్రల ఫలితంగా పిల్లలు ఆరడుగుల పటం తయారు చేశారనీ, దానిని వేలాడదియ్యటానికి కప్పుకి గిలకల చక్రం ఏర్పరిచారని ఇందులో రాశారు.

కాని ఈ పటాలు, ఈ ఇంటర్వ్యూలు, ఈ ప్రాజెక్టులు అసలు ఎవరు నిర్ణయించారు? పిల్లలు యాత్రలకు వెళ్ళివస్తే రిపోర్టులు,

పటాలు, చిత్రాలు, కథలు వంటి రూపంలో ఏదో ఒక ఫలితం ఉండాల్సిందేనా? నాకు నచ్చిన దానిని చూసిన తరువాత ఆరడుగుల నమూనాను తయారు చేయడం, పాటను రాయడం, లేదా రిపోర్టు రాయవలసిన అవసరం నాకులేదు.

ఒకవేళ ఏవిధమైన ఫలితం కావాలనుకుంటే దానికోసం ఎదురు చూసి, అది దానంతట అదే ప్రకటిత మయ్యేటట్లు చూడడం ముఖ్యం. దీనికి చాలా సమయం, అప్పుడప్పుడు కొన్ని సంవత్సరాలు కూడా పట్టవచ్చు. కాని 'సృజనాత్మక అధ్యాపకులు' దీనికోసం ప్రయత్నించినా, ప్రేరేపించినా, వత్తిడి చేసినా అది సాధ్యంకాదు.

అటువంటి బడిలో నేను పాఠాలు చెప్పాను కాబట్టి అక్కడ ఫలితాలు ఎలా ఉంటాయో నాకు తెలుసు. పిల్లలు ఏదైనా విష యాన్ని పాట, లేక నృత్యరూపంలో వ్యక్తపరచడాన్ని ఒక బడిలో ప్రముఖుడు ఎప్పుడూ గర్వపడుతూ ఆశ్చర్యాన్ని వ్యక్తం చేస్తుంటాడు. అధ్యాపకుల ఈ అభిప్రాయాలు పిల్లల మనసులలో ముద్రపడి పోతాయి. అధ్యాపకులకు ఏమిష్టం, తాము ఏం చేస్తే వాళ్ళకు నచ్చు తుందనేది వాళ్ళు త్వరగా గ్రహిస్తారు. ఏం చెయ్యడం వల్ల బహు మతి, ప్రశంస, మంచి రిపోర్టు మొదలైనవి లభిస్తాయనేది వాళ్ళకు తెలుస్తుంది. 'ప్రియ శిష్యుల బృందం'లో చేర్చుకోక పోవడం ద్వారా ఏం చేస్తే తమకు నచ్చదో కూడా అధ్యాపకులు తెలియచేస్తారు. 'న్యూలిటిల్ స్కూల్'లో ఇటువంటివేవీ ఉండవు.

ఈ బడి ఎలాంటిదో తెలుసుకోవాలంటే దీనిని తప్పక చూడాలి. పిల్లలకోసం పెద్దలు నిర్ణయించిన పనులను వాళ్ళతో ఎలా చేయిం

చాలి అన్న ఆటకి అన్ని బడులు అలవాటు పడిపోయాయి. ఆ పనుల నుండి ఎలా తప్పించుకోవాలా అన్న ఆలోచనలో పిల్లలు ఉంటారు. ఇలాంటి ఆట ఆడని ప్రదేశం ఉంటుందని మనం ఊహించం. 'న్యూలిటిల్ స్కూల్'ని చూసిన తరువాత అప్పటివరకు మంచివను కున్న బడుల పట్లకూడా నాకు విముఖత ఏర్పడింది. అటువంటి బడులలోని ఆడంబరం, తెలివి, భయం, పిరికితనం, సిగ్గు, గర్వం, ఒయ్యారంగల పిల్లలకీ 'న్యూలిటిల్ స్కూల్'లో సహజత్వం, నిర్భ యత, స్పష్టత, నిజాయితీ గల పిల్లలకీ మధ్య చాలాతేడా ఉంది. నాకు పిల్లలతోపాటు ఉండడం ఆనందంగా ఉంటుంది, కాని పిల్ల లను బడులలో చూడడం కన్నా చూడకుండా ఉండటం మేలని పించేది.



'న్యూ లిటిల్ స్కూల్'లో ఏమేమి జరుగుతాయి? ఏవిధంగా పిల్లల జీవితాలు మారిపోతాయి? ఏవిధంగా మెరుగుపడతాయి? లాంటి విషయాలు వివరించటానికి ఒక పెద్ద పుస్తకం కూడా సరిపోదు. అక్కడ ఏ ఇద్దరు పిల్లలు ఒకే రకమైన పని చెయ్యరు. ఏ ఒక్కరూ రెండు రోజులు ఒకే రకంగా ఉండరు, ఒకే పని చెయ్యరు. ఈ బడి గురించి ఎవరైనా, ఏనాటికైనా ఒక పుస్తకం రాస్తే ఎంత బాగుంటుంది!

సంకీర్ణమైన విద్యా ప్రమాణాలపట్ల తల్లిదండ్రులకు, అధ్యాపకులకు ఆసక్తి ఎక్కువ. ఆ ప్రకారం చూసినా ఈ బడి విజయవంతమైన బడి అని నేను ఖచ్చితంగా చెప్పగలను. ఇక్కడ పిల్లలను వారి ఐక్యూ (I.Q) లేదా విద్యకు సంబంధించిన ప్రతిభ ఆధారంగా చేర్చుకోరు. అంతకు ముందు బడిలో బాగా చదవని పిల్లలు కూడా ఇక్కడ చేరుతుంటారు.

ఇక్కడ చదువు పూర్తిచేసిన పిల్లలందరూ అత్యంత కఠినమైన నియమాలు గల సాంప్రదాయ బడులలో చేరి చక్కటి ప్రతిభ కనబరిచారు. ఉన్నత పాఠశాలకు వయస్సు దాటిపోయిన వాళ్ళు ప్రొఫెషనల్ శిక్షణ తీసుకున్నారు. ఈ దేశంలో కేవలం 5శాతం మాత్రమే ఈ శిక్షణను పొందగలుగుతున్నారు. ఇంత మంచి ఫలితాలను ఇచ్చే ఇతర బడులు నాకు తెలియవు.

డెన్మార్క్‌లోని అన్ని కుటుంబాలు, వర్గాల నుంచి పిల్లలు ఈ బడిలో ఉన్నారని చెప్పలేం. అమెరికాలో లాగానే డెన్మార్క్‌లోనూ చాలామంది తల్లిదండ్రులు తమ పిల్లలను ఇటువంటి బడికి పంపాలనుకోరు. 'న్యూ లిటిల్ స్కూల్'కి పిల్లలను పంపించే తల్లిదండ్రులు/సంరక్షకుల మధ్య ఎన్నో అభిప్రాయబేధాలు ఉండవచ్చు. కానీ పిల్లలను విశ్వసించడంలో వాళ్ళందరూ ఒకటే. ఆ విధంగా లేకపోతే తమ పిల్లలను ఈ బడిలో చేర్పించరు! ఈ దృష్ట్యా చూస్తే ఈ తల్లిదండ్రులు, వారి పిల్లలు కూడా చాలా అద్భుతమైన వాళ్ళని చెప్పాలి. ఈ ప్రపంచం గురించి పిల్లలు తెలుసుకోవాలనుకుంటారన్న నమ్మకం ఉండాలి, ఆ నమ్మకం ఉన్నప్పుడు వారు అది సాధించగలుగుతారు కూడా అని మాత్రమే నేను చెప్పదలుచుకున్నాను.

ఒక పరిచయం:

కోపెన్‌హాగన్‌లో బైగ్స్‌వార్డు మధ్య తరగతికి చెందిన ఒక ప్రాంతం. ఒక చిన్నపాటి పారిశ్రామిక క్షేత్రంలో ఓ రోడ్డు పక్కన ఈ

బడి ఉంది. ఈ బడికీ, దాని వెనుకవైపు ఉన్న పాడుబడిన ఇళ్ళకీ మధ్య ఓ చిన్నపాటి అడవి ఉంది. ఈ భవనాన్ని వేరే నిమిత్తం కేటాయించిన దృష్ట్యా ప్రస్తుతం వీళ్ళు వేరే ప్రదేశం వెతుక్కోవలసి ఉంది. బడి ప్రధానగది మొత్తం ప్రదేశంలో మూడింట రెండు వంతులు ఉంటుంది. ఈ గది పొడవుగా, సన్నగా ఉంటుంది. దీని రెండు గోడలకూ కిటికీలు నేలకు 4 నుండి 5 అడుగుల ఎత్తులో ఉంటాయి. బయటకు చూడాలంటే పిల్లలు కిటికీలోకి ఎక్కాలి. అయితే కిటికీలోంచి చూడటానికి ఇలాంటి భవనాలు తప్ప అక్కడ ఏమీలేవు.

ప్రధాన గది దగ్గర ఒక చిన్న వ్యాయామశాల ఉంది. బడికి సంబంధించిన అన్ని సమావేశాలు ఇక్కడే జరుగుతాయి. ప్రధాన గదికి రెండవ వైపు మూత్రశాల ఉంది. ఆ పక్కనే రెండు చిన్న గదులు న్నాయి. వీటిలో ఒకటి ప్రధానంగా సంగీతం కోసం ఉపయోగిస్తారు. ప్రధాన గదికి ఒక వైపు వర్కుషాపు ఉంది. మిగిలిన భాగాన్ని 2000 చెక్క పెట్టెలలో చిన్న చిన్న భాగాలుగా విభజిస్తారు.

ప్లాస్టిక్ పెట్టెలను ఉపయోగించడం మొదలుపెట్టిన తరువాత ఒక ఫ్యాక్టరీ ఈ చెక్క పెట్టెలను బడికి ఉచితంగా ఇచ్చింది. కుర్చీలు, బల్లలు, పుస్తకాల అలమరాలు, అరలుగా రకరకాలుగా ఉపయోగ పడే ఈ ముదురు ఆకుపచ్చ రంగు చెక్కపెట్టెలు బడిలోకి ప్రవేశించ గానే దృష్టిని ఆకట్టుకుంటాయి. త్వరలోనే అందరూ వీటికి అలవాటు పడిపోతారు. చాలా సాధారణమైన, దృఢమైన, చౌకైన ఈ పెట్టెలు బడి భావనకు ప్రతీకలన్నట్లు ఉంటాయి. ఇవి లేకుండా నేనైతే బడిని ఊహించలేను.

బడి సామానులు చాలా సాధారణమైనవి, చౌకైనవి. ఇలాంటి బడిలో పని చేయాల్సి వస్తే చాలామంది అధ్యాపకులు దురదృష్టంగా భావిస్తుంటారు. ఆఫీసులో ఒక మామూలు టైపు రైటరు (కరెంటుది కాదు), ఒక టేపు రికార్డరు, ఒక డూప్లికేటర్ ఉన్నాయి. ప్రధాన గదిలో ఒక ఫ్రిజ్ ఉంది. ఒక స్టవ్ కూడా ఉంది. పిల్లలు అప్పుడు దీనిపై వంట చేసుకుంటారు. కానీ సాధారణంగా పిల్లలు డేనిష్ సాండ్‌విచ్‌లు తెచ్చుకుని తింటారు. చిన్నదైనా బడిలో ఒక మంచి గ్రంథాలయం ఉంది. వర్క్‌షాపులో చెక్క, లోహం పనులకు ఉపయో

గించే పరికరాలున్నాయి. వెల్డింగ్‌కి ఉపయోగించే పరికరాలు కూడా ఉన్నాయి. ఆటలు, పజిల్స్‌కీ సంబంధించి పుస్తకాలు కొన్ని ఉన్నాయి. విజ్ఞాన శాస్త్రం, గణిత శాస్త్రాలకు సంబంధించిన పుస్తకాలతోపాటు కొన్ని పాఠ్య పుస్తకాలున్నాయి. బడిలో అత్యవసరంగా భావించే విజ్ఞాన శాస్త్రం, గణిత శాస్త్రాలకు సంబంధించిన పరికరాలు నాకు ఇక్కడ కనిపించలేదు.

శిల్పకళకు సంబంధించిన పరికరాలు కూడా ఎక్కువగాలేవు. మట్టి, రంగులు, లేదా డ్రాయింగ్ బోర్డు ఉపయోగిస్తున్న పిల్లలను చూసినట్లు నాకు జ్ఞాపకం లేదు. కాని బడిలో పిల్లలు రంగులు వేసిన కొన్ని చిత్రాలు, ఇతర వస్తువులు ఉన్నాయి. అంటే బడిలో రంగులు ఉండే ఉంటాయి. అవసరమైనప్పుడు పిల్లలు వాటిని తీసుకోవచ్చు. అక్కడ ఒక కుట్టు మిషనుతోపాటు రెండు చేనేత మగ్గాలు కూడా ఉన్నాయి.

ఇంతకు ముందుసారి నేను ఆ బడికి వెళ్ళినపుడు అక్కడ చాలా పక్షులు, చిన్న చిన్న జంతువులు బోనులలో ఉండేవి. కాని రెండవ సారి వెళ్ళినపుడు పక్షుల స్థానంలో ట్యాంకులలో రకరకాల చేపలు కనిపించాయి. ఈ ట్యాంకులను పెద్దల సహాయంతో పిల్లలే స్వయంగా తయారు చేశారు. కొంతమంది పిల్లలైతే గంటల తరబడి ఈ చేపలను చూస్తూ ఉంటారు. బంతులు, గెంతటానికి ఉపయోగించే (స్కిప్పింగ్) తాడు వంటి ఆటవస్తువులు అక్కడ ఉన్నాయి. వ్యాయామ శాలలో ఎగిరి దూకేందుకు ఒక పరుపు ఉంది. సంగీతం గదిలో పాతబడిన ఒక పియానో, కొన్ని గిటార్లు, ఒక అధ్యాపకుడు తయారు చేసిన వాద్య యంత్రాలు, వివిధ సైజుల్లో డ్రమ్స్ ఉన్నాయి.

ఇది అక్కడ ఉన్న వస్తువుల పూర్తిజాబితా కాదు. ఆ గదిలో నాకు పరిచయం లేని, కనిపించని వస్తువులు ఇంకా ఉండే ఉంటాయి. నేను చూసిన వాటిని బట్టి మూడు విషయాలు స్పష్టమవుతున్నాయి. మొదటిది సాంప్రదాయ పాఠశాలలో కనిపించే సామానులు, పరికరాలు చాలా తక్కువ ఇక్కడ ఉన్నాయి. రెండవది పాఠశాలలో లభ్యమయ్యే అన్ని పరికరాలు పిల్లలు ఉపయోగించటానికి ఉద్దేశించినవి. ఇతర బడులలోలాగా ఇక్కడ అలమరాలకు తాళాలుండవు. అలాగే గ్రంథాలయం నుండి పుస్తకాలు తీసుకోటానికి ఎటువంటి నియమ నిబంధనలు లేవు. ఇక్కడకి వస్తే అర్థమయే మూడవ విషయం: ఒకవేళ 'ఇలాంటి పని చేసే ప్రదేశం' పిల్లలకోసం మొదలు పెట్టాలనుకుంటే ఎక్కువ ఖర్చుతో పనిలేదు. పిల్లలు పనిచేయడం కోసం ఖరీదైన సామానుల అవసరం ఉండదు.

అధ్యాపకులు చెప్పే పాఠాలు వినడం, వర్క్‌బుక్కులు నింపడం కంటే భిన్నంగా ఉండటంవల్ల ప్రారంభంలో గణితం, విజ్ఞాన శాస్త్రాల ప్రయోగశాలలపట్ల పిల్లలు ఎక్కువ ఆసక్తి కనబరచరు. కానీ పిల్లలను ఉత్తీర్ణులను చేయడానికి మంచి ప్రత్యామ్నాయాలు ఏమైనా ఉంటే పిల్లలు అధిక సమయం ప్రయోగశాలలో గడుపుతారేమో.

తగినన్ని నిధులులేని కారణంగా బడిలో చాలావరకు వస్తువులు లేవు. ఒక వేళ నిధులు ఉన్నట్లయితే అధ్యాపకులకు, పిల్లలకు అవసరమయ్యే కొన్ని వస్తువులు కొనాల్సి ఉంది. ఒకవేళ అధ్యాపకులు, విద్యార్థులు ఏదైనా వస్తువు కావాలని నిర్ణయించుకుంటే దానిని అప్పుమీద పొందటం లేదా చౌకగా ఖరీదుచేసే మార్గాలు వెదుక్కుం

టారు. ఒకవేళ బడి దగ్గర నిధులున్నట్లయితే పిల్లలు, అధ్యాపకులు కలసి సామాను కంటే మిన్నగా ఉపయోగపడే కార్యక్రమాలకు ఖర్చుచేయాలని నిర్ణయించుకుంటారేమో.

కోపెన్‌హాగెన్, దాని చుట్టుపక్కల ప్రదేశాలకు విద్యార్థులు సందర్శన యాత్రలు చేస్తారు. ఒకసారి పిల్లల బృందం ఒకటి కాలి నడకమీద స్వీడన్ వెళ్ళింది. నిధులు ఉన్నట్లయితే వారు ఇంకా ఎక్కువ యాత్రలు చేసి ఉండేవారు.

హాజరు గురించి కూడా మాట్లాడుకుందాం. అన్ని చోట్లలాగే డెన్మార్క్‌లో కూడా చట్టం ప్రకారం పిల్లలు తప్పనిసరిగా బడికి వెళ్ళాల్సిందే. బహుశా ఇతర బడులలో ఈ చట్టాన్ని ఖచ్చితంగా అమలు చేస్తారనుకుంటా. కానీ దీనర్థం రోజూ హాజరు తీసుకుంటారనిగాని, ఏదైనా సమయంలో అందరూ హాజరు కావాలని మాత్రం కాదు. బడిలో ఎవరున్నారు, ఎవరు లేరని చూడవలసిన బాధ్యత వారంలో ఒకరోజు ఒక అధ్యాపకునికి ఉంటుంది. పిల్లలు బడిలో లేకపోతే చింతించాల్సిన లేదా ఇంటికి తెలియ చెయ్యాల్సిన విషయంగా భావించరు. ఎవరైనా బడికి రాకపోవడానికి ఏదోకారణం ఉండి ఉంటుందని, వాడు ఎక్కడున్నా చాలా ఉపయోగపడే పనిలోనే ఉన్నాడని భావిస్తారు.

ఎవరైనా పిల్లవాడు ఒకవేళ బడిలో లేనట్లయితే అతడు ఎక్కడున్నాడు, ఏంచేస్తున్నాడని ఎవరో ఒకరికి ఖచ్చితంగా తెలిసేలా బడి వాతావరణం ఉంటుంది. ఒకటి రెండు రోజులపాటు ఎవరైనా బడికి రానట్లయితే ఆ రోజులలో తాను ఏమేమి చేశాడో అతడు అందరికీ తప్పక చెబుతాడు. ఒకటి, రెండు రోజులపాటు ఎవరైనా బడికి రాకుండా ఉండి దానికి కారణం ఎవరికీ తెలియకుండా ఉండటమన్నది ఎప్పుడో గాని జరగదు. ఒకవేళ చాలా రోజులు బడికి రాకపోయినట్లయితే బహుశా అధ్యాపకులు కూడా కారణాలు తెలుసుకోటానికి ప్రయత్నిస్తారనుకుంటా.

ఒకసారి ఒక విద్యార్థి చాలా రోజుల పాటు బడికిరాలేదు. తిరిగి అతనిని బడికి ఎలా తీసుకురావాలి అని అధ్యాపకులు కూడా ఆలోచించారు. సరైన కారణం ఉన్నట్లు భావిస్తే విద్యార్థులు బడికి రాకుండా ఉండేందుకు స్వాతంత్రం ఉంది. ఇందుకోసం ముందుగానే అనుమతి తీసుకోవాల్సిన అవసరం లేదు. తిరిగి వచ్చిన

తరువాత కూడా వివరణ ఇవ్వనక్కర లేదు. ఇతర స్కూళ్ళు, కాలేజీ విద్యార్థుల్లాగా బడికి గైరు హాజరయిన సమయంలో వారు ఏం చేశారో రాసివ్వవలసిన అవసరం ఇక్కడి విద్యార్థులకు లేదు.

ఈ బడికి అన్నిసార్లు నేను వసంత రుతువులో మేనెల మధ్యగానీ లేదా చివరలోగాని వెళ్ళాను. సుదీర్ఘ రాత్రుల శీతరుతువు తరువాత సూర్యుడు వెచ్చబడటంతో స్కాండినేవియన్‌లు బయటకు రావడానికి ఇష్టపడతారు. ఈ సమయంలో ఏ రోజుచూసినా దాదాపు సగం మంది పిల్లలు మాత్రమే బడికి హాజరవుతారు. శీతాకాలంలో దాదాపు పిల్లలందరూ బడికి హాజరవుతారు. పిల్లలు ఏం చేస్తారు, బడిలో జరిగే కొన్ని పనులను నేను చెప్పదలుచుకున్నాను. కొన్ని పనులు పిల్లలందరూ కలిసి చేస్తారు.

రెండేళ్ళ క్రితం బడి సమావేశంలో జరిగిన చర్చల తరువాత ఒకరోజు మధ్యాహ్నం పిల్లలూ, పెద్దలూ అందరూ కలిసి భోజనం చేయాలని నిశ్చయించుకున్నారు. దీనికోసం కొంత మొత్తం కూడా కేటాయించారు. బజారునుంచి కొంతమంది సరుకులు తీసుకువస్తే, మరికొంత మంది వంటచేస్తారు. కొందరు వడ్డిస్తారు. అందరూ కలిసి భోజనం చేస్తారు. హంగామా, ఉల్లాసం, స్నేహం నిండిన ఆనంద, ఆహ్లాదకర దృశ్యమిది.

బడిలో తరచుగా విద్యార్థులు, అధ్యాపకులు కలిసి పాల్గొనే సాధారణ సభలు జరుగుతూ ఉంటాయి. ఇందులో అందరూ మాట్లాడవచ్చు, అలాగే ఓటు వేయవచ్చు. అందరి ఓటుకు సమాన విలువ ఉంటుంది. ఈవిధంగా జరిగే కొన్ని బడులలో పదేళ్ళలోపు పిల్లలు నిజంగా పాల్గొనలేరు. కాని ఈ బడిలో అలాకాదు. చిన్న పిల్లలు కూడా బాగా మాట్లాడతారు.

ఓటింగ్ లేకుండా పరస్పర సంప్రదింపులతో అందరూ లేదా ఎక్కువమంది అంగీకారంతో నిర్ణయాలు తీసుకునేలా ప్రయత్నాలు జరుగుతాయి. పరస్పర సంబంధాలు, సమస్యలు, ఉదా: ఎవరినైనా ఏడ్పించడం లేదా ఇబ్బంది పెట్టడం వంటి వాటిగురించి కూడా మాట్లాడతారు. అంతేకాకుండా వాళ్ళు బడి విధానం, ఖర్చుల గురించి కూడా చర్చించుకుంటారు.

ఈ సమావేశాల్లో తరుచుగా బడి పటం, 'గదుల' ఏర్పాట్లు గురించి జోరుగా చర్చలు జరుగుతాయి. ప్రధాన గదిని చెక్కపెట్టెలలో చిన్న చిన్న భాగాలుగా ఎలా విభజించాలనే దానిగురించి చాలా సమావేశాలు జరుగుతుంటాయి. ప్రస్తుత ఏర్పాట్లు తమ కెందుకు నచ్చలేదో పిల్లలు వివరిస్తారు. తరువాత పిల్లలు కొలతలతో ఒక కొత్త ఏర్పాటు ప్రతిపాదిస్తారు. దీనిని సమావేశంలో ఖరారు చేస్తారు. ఆ తరువాత జోరుగా పని మొదలవుతుంది. మొత్తం సామాను, పుస్తకాలు బయటకు తీసుకెళతారు. అడ్డుగోడలుగా పెట్టిన చెక్క పెట్టెలు తీసేస్తారు. ఇతర సామాగ్రి కూడా తొలగిస్తారు. తరువాత గదిని బాగా శుభ్రం చేస్తారు. అప్పుడు చెక్క పెట్టెలను కొత్త ఏర్పాటు ప్రకారం అమరుస్తారు. పుస్తకాలు, సామాను తిరిగి సర్దుతారు.

ఇది చాలా పెద్ద పని. ఇందులో పాల్గొనడం పిల్లలకు ఉల్లాసాన్ని ఇస్తుంది. ఈ సమయంలో వాళ్ళు చాలా ఉత్సాహంగా ఉంటారు. ఒక ఆదర్శ విద్యాలయ భవనం ఎప్పటికీ పూర్తి కాగూడదని చాలా

సంవత్సరాల క్రితం నేను ఒక యువ ఆర్కిటెక్ట్‌తో అన్నాను. పిల్లలు దాన్ని మళ్ళీ డిజైన్ చేసి మళ్ళీ మళ్ళీ మార్పులు చేసేవిధంగా అది ఉండాలి. 'న్యూ లిటిల్ స్కూల్' ఇటువంటిదే.

ఉదయం వ్యాయామం, నృత్యం బడి దినచర్యలో చాలా ముఖ్యమైన అంశం. స్క్వాష్ కోర్టు కంటే కొంచెం పెద్దదిగా ఉన్న గదిలో వ్యాయామశాల ఉంది. దీని పైకప్పు కొంచెం కిందికి ఉంటుంది. అక్కడ కేవలం ఒక జంపఖానా, రెండు డ్రమ్స్ ఉన్నాయి. నృత్యం, సంగీతంలో శిక్షణ పొందిన ఒక అధ్యాపకుడు, చాలామంది పిల్లలు ఈ వ్యాయామశాలలో రోజూ కలుస్తుంటారు. అధ్యాపకుడు డ్రమ్ మీద ఉత్సాహపరిచే వేగవంతమైన ధ్వనులను చేస్తే పిల్లలు



గెంతుతూ, దూకుతూ, ఎగురుతూ, వెనుకాముందుకు ఊగుతూ ఉత్సాహంగా నృత్యం చేస్తుంటారు. పిల్లలు ఆనందంతో తమలోని లయతో కదులుతూ ఇంకో లయను అందుకుంటారు. పిల్లలు తరచుగా తమకు నచ్చిన లయను తిరిగి చేస్తూ ఉంటారు.

పిల్లలు, అధ్యాపకుడు ఉత్సాహంగా ముందుకు పోతూ కొత్తవైన, హుషారునిచ్చే, వినసొంపైన నాదాలను, లయను కనిపెడుతుంటారు. కొత్తరాగాలు, కొత్త లయ, కొత్త తాళాలను కనిపెడుతుంటారు. ఒక్కొక్కసారి ఎవరైనా పిల్లవాడు డ్రమ్ వాయిస్తాడు. లేదా ఒక డ్రమ్ ఒక పిల్లవాడు వాయిస్తుంటే రెండవ డ్రమ్ అధ్యాపకుడు వాయిస్తాడు. అటువంటి దృశ్యం యొక్క సౌందర్యాన్ని, ఆనందాన్ని, శక్తిని మాటల్లో వర్ణించడం సాధ్యం కాదు. ఇలాంటిది నేనెప్పుడూ చూడలేదు. పిల్లల్లో చాలామంది ఆరోగ్యం, ఉత్సాహంతో నిండి ఉన్నారు. ఈ కార్యక్రమం చాలాసేపు జరుగుతుంది. తమ శక్తిలో చాలావరకు పిల్లలు ఇక్కడ ఖర్చు చేస్తుంటారు. అయితే పూర్తిగా నీరసపడేవరకు చేయరు.

బడిలో ప్రశాంతమైన, ఆలోచనాపూరిత రోజులూ ఉంటాయి. అయితే పిల్లలు ఎక్కువగా మాట్లాడుతూ, కేకలు వేస్తూ, అందరితో కలిసి పనులు చేస్తూ ఎక్కువ రోజులు గడుపుతారు. ఈ పిల్లల కంటే తక్కువ చురుకైన అమెరికన్ పిల్లలకు మత్తుమందులు ఇచ్చి నెమ్మది పరుస్తుంటారు. బడి వ్యవస్థీకృత ఆటపాటల్లో ఈ నృత్య తరగతి ముఖ్యమైన కార్యక్రమం. బడికి దగ్గరగా, పది నిమిషాలలో నడిచి వెళ్ళేంత దూరంలో ఒక ఫుట్‌బాల్ మైదానం ఉంది. ఫుట్‌బాల్

ఆటను ఇష్టపడి, ఆటగాళ్ళు కావాలనుకునే పెద్ద పిల్లలు అక్కడికి వెళుతుంటారు.

వెల్డింగ్ సామాను రాకముందు బడిలో ఒక పొయ్యి (బున్సన్ బర్నర్) ఉండింది. ఒక రోజు ముగ్గురు నలుగురు పిల్లలు ఒక గంట వరకు దాని చుట్టూ చేరి పనులు చేస్తున్నారు. నేను కూడా వారితో ఉన్నాను. మా అందరి దగ్గరా మేకును పట్టుకునే ఒక పట్టకారు ఉంది. దాంతో పట్టుకుని మేం మేకును వేడిచేస్తున్నాం. మేకు వేడెక్కి ఎర్రగా, మెత్తగా మారిన తరువాత దానిని బయటకు తీసి రకరకాల వస్తువులు తయారుచేస్తున్నారు. చాలామంది రైలు పట్టా ముక్క పై కాలిన మేకు పెట్టి సుత్తితో కొడుతూ ఉన్నారు. నేను కూడా కాలిన మేకులతో కొన్ని ఆకృతులను తయారు చేయాలని ప్రయత్నిస్తూ రెండు మేకులను సాగదీసి అతికించగలనో లేదోనని చూస్తున్నాను. కాని అది సాధ్యం కాలేదు.

ఏడు, ఎనిమిది ఏళ్ళు కూడా నిండని ఒక కొత్త పిల్లవాడు ఒకేపనిని మాటి మాటికీ చేస్తున్నాడు. ఎర్రగా కాలుస్తున్న మేకును ఒక్క ముక్కలోకి గుచ్చగా అది కాలి దాంట్లోంచి పొగవస్తోంది. ఈ కుర్రవాని మేకుకు ఎవరైనా తమ మేకు తాకించినా, నిప్పులో ఎక్కువ భాగం తీసుకున్నా వాడు బిగ్గరగా కేక పెట్టేవాడు. దీనికి ఇతర పిల్లలు భయపడేవారో లేదో గాని నేను మాత్రం భయంతో వణికిపోయే వాడిని. ఏ పిల్లవానిలోనూ ఇంతటి కోపం నేను చూడలేదు. పిల్లవాడు మేకును చెక్కలోకి గుచ్చినపుడు అతడి ఆలోచనలు ఎలా ఉండి ఉంటాయో నేను ఊహించే సాహసం చేయలేదు. అతనితో నాకు అంతకంటే ఎక్కువ పరిచయం కలగలేదు.

రెండు సంవత్సరాల తరువాత నేను ఇంకోసారి బడికి వెళ్ళి నప్పుడు ఆ కుర్రవాడు ప్రశాంత, ప్రసన్న చిత్తుడుగా ఉన్నాడు. వాడు వెల్డింగ్‌లో మంచి నేర్పుగల పనివాడిగా తయారయ్యాడు. వాడు నన్ను ఒక స్నేహితునిగా చూసినందుకు నాకు ఆశ్చర్యం, సంతోషం కలిగాయి.

సంగీతం తరగతిలో మంచి సంగీతజ్ఞుడు, పియానో వాదనలో నిపుణుడు అయిన ఒక అధ్యాపకుడు ఎలక్ట్రిక్ గిటార్ పై ఒక రాగాన్ని వాయించడం ఒక పిల్లవాడికి నేర్పిస్తున్నాడు. అతను చెప్పి, వాయించి చూపిన తరువాత ఇద్దరూ కలిసి వాయించసాగారు. ఇద్దరు చిన్నపిల్లలు కూడా వాళ్ళతోపాటు డ్రమ్స్ వాయిస్తున్నారు. ఆ పిల్లలు సరిగా వాయించనప్పటికీ ఎవరూ వారిని వారించలేదు. 'మేం పనిలో ఉన్నాం, కనిపించటం లేదా?' అనిపించేలా కోపంగా కూడా ఎవరూ చూడలేదు. నాలాగే గదిలో మరో ఇద్దరు, ముగ్గురు పిల్లలు కేవలం చూస్తున్నారు. పియానో, గిటార్ లయలోకి వచ్చి నప్పుడు నేను కూడా వారితో పాటు ఈలవేయసాగాను.

ఇంకో అమ్మాయి కిటికీమీద కూర్చొని బయటికి చూస్తూ ఉంది. అక్కడున్న వారి సామర్థ్యం, ఏకాగ్రతస్థాయి భిన్నంగా ఉన్నప్పటికీ వారందరికీ పాల్గొనేందుకు అనుమతి ఉంది. దీని గురించి విద్యావేత్త శ్రీమతి స్టెలీ బ్రేస్ ఈ విధంగా వివరించారు– "ఏకాగ్రతతో చూడడం ఒక మహత్వ పూర్వమైన ప్రక్రియ. పిల్లలు ఏకాగ్రతను పెంచుకునే అవకాశాలను గౌరవించాలి. ఎవరైనా పిల్లవాడు ఏకాగ్రతతో ఎవరి నైనా చూస్తున్నప్పుడు అతని ఏకాగ్రతను భంగపరచగూడదు. అలా

గని 'ప్రోత్సహించనూ' రాదు... కొంతమంది పిల్లలు స్వయంగా ఏదైనా చేసేముందు ఇతరులు ఆ పని చేస్తుండగా చూసి తాము ఏం చేయాలనుకుంటున్నారో ఆలోచించుకుంటారు." 'న్యూ లిటిల్ స్కూల్'లో అందరికీ ఈ విషయం తెలుసు.

సమావేశం జరిగే స్థలంలో ఎటువంటి ఫర్నిచరూ లేదు. సమావేశం జరిగేటప్పుడు సభ్యులు గదిలో ఒక వైపున గోడకు ఉన్న కుర్చీ



లలో కూర్చుంటారు. అవి తప్ప గది ఖాళీగా ఉంటుంది. 14 సంవత్సరాల వయస్సుగల ఓ అమ్మాయి చాలా రోజులుగా గంటల తరబడి ఈ గోడ మీద టెన్నిస్ బాల్‌ను బాట్‌తో కొడుతూ ఉంది. ప్రతిసారీ ఆమె 20-40 సార్లు బంతి కిందపడకుండా కొట్టగలుగుతోంది. 8-12 సంవత్సరాల వయస్సుగల ఆరుగురు అమ్మాయిలు గంట-రెండు గంటలపాటు ఇక్కడ తాడుతో (స్కిప్పింగ్) ఆడుతుండడం ఇంకోసారి చూశాను. ఆట నియమాలను ఎప్పటికప్పుడు మారుస్తూ ఏకాగ్రత, శ్రద్ధలతో ఆ ఆటను వాళ్ళు ఆడుతున్నారు.

బడిలో కొత్తగా చేరిన ఒక చిన్న పిల్లవాడు చాలా కోపిష్టి. దౌర్జన్య స్వభావం కలవాడు. 'తీవ్రవాద బృందం'గా తమను స్వయంగా పిలుచుకునే ఒక బృందంలో అతడు సభ్యుడు. ఒకసారి వాడు కర్రతో అట్ట పెట్టెను కొడుతూ ఆడుకుంటున్నాడు. పది సంవత్సరాల వయస్సు అమ్మాయి కంట్లో వాడు బలంగాకొట్టి తన ఘనకార్యాన్ని చూడకుండానే పారిపోయాడు. నొప్పితో కంటిమీద చెయ్యి పెట్టుకొని ఆ పిల్ల విల విలలాడుతోంది. పిల్లలు, అధ్యాపకులు కూడా ఈ దృశ్యాన్ని చూశారు. దగ్గరగా ఉన్న వాళ్ళు ఆమె క్షేమం గురించి విచారించారు. ఆమెకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియచేశారు. ఇంతకుమించి ఏమీ జరగలేదు.

అదే వేరేబడిలో ఇటువంటి ఘటన జరిగి ఉంటే ఆ అమ్మాయి గగ్గోలు పెట్టి ఉండేది. ఇతర పిల్లలు కూడా అధ్యాపకులకు ఫిర్యాదు చేసి ఉండేవారు. ఆ పిల్లవాడిని ఈడ్చుకు వచ్చి ఉండేవారు. అతనితో క్షమాపణలు చెప్పించి శిక్షకూడా విధించి ఉండేవారు. కానీ ఇక్కడ ఆ

అమ్మాయి, పిల్లలు, పెద్దలందరూ ఆ ఆకతాయి పిల్లవాడు ఉద్దేశ పూర్వకంగా కొట్టలేదని, జరిగిన దానికి వాడు కూడా స్వయంగా సిగ్గుపడుతూ, భయపడుతున్నప్పుడు మళ్ళీ వాడిని శిక్షించి అవ మానించవలసిన పనిలేదని భావించారు. వాడు ఎందుకూ పనికి రానివాడని అనిపించేలా ఎందుకు చెయ్యాలి. బహుశా ఇంటి వద్ద జరిగిన ఇటువంటి అనుభవం కారణంగానే అతడు ఇలా ప్రవర్తిస్తున్నాడేమో. శిక్ష పడుతుందని భయపడవలసిన అవసరం లేదని చెప్పటం అతనికి మేలు చేస్తుంది.

ఉపన్యాసాలు, ఉపదేశాలు, శిక్షలు లాంటివేవీ లేకుండా తీవ్ర స్వభావులైనవారు ఈ బడిలో ఈ విధంగా నాగరికులుగా మారుతున్నారు. పెద్దవాళ్ళు పిల్లలతో సహనశీలురుగా, క్షమాగుణం కల వారిలా వ్యవహరిస్తూ వారిలో నమ్మకాన్ని ఉంచుతారు. కాలక్రమేణా పిల్లలు కూడా ఒకరిపట్ల ఇంకొకరు ఇలాగే ప్రవర్తిస్తారు. అట్లాగని ఒకరి అన్నం తినడం, లేదా వస్తువులు లాక్కోవడం వంటివి జరిగితే దెబ్బలాడకుండా, కేకలు వేయకుండా ఉంటారని కాదు. ఒకరిపట్ల ఒకరికి కోపం ఉంటుంది. కానీ ఇతర బడుల పిల్లల మాదిరిగా ఒకరి గురించి మరొకరు చెడుగా చెప్పుకోరు, అధ్యాపకులకు ఫిర్యాదు చేయరు. కోపాన్ని, ద్వేషాన్ని చాలాసేపు ఉంచుకోరు.

ఈ బడి ఎందుకు విజయవంతం అయింది?

పిల్లలు ఉల్లాసంగా, ఉత్సాహంగా, ప్రసన్నచిత్తులై ఎందుకు ఉంటారు అనే విషయం గురించి కొంతమేరకు పైవివరణ సరిపోతుందేమో. కానీ చదువులో కూడా పిల్లలు రాణించటానికి కారణం

ఏమిటి? దీనికి ఒక అధ్యాపకుడు ఇలా బదులిచ్చాడు: "అధ్యాపకులు, పిల్లలు ఎక్కువగా మాట్లాడుతుంటారు. ఒకరు చెప్పిన దాన్ని ఇంకొకరు వింటూ ఉంటారు. దీని అర్థం అధ్యాపకులు మాట్లాడుతుంటే పిల్లలు వింటూ ఉంటారనికాదు. ఇక్కడ లెక్చర్లు (ఉపన్యాసాలు) వంటి వేమీ ఉండవు. ఇతర కొత్త బడులలో అధ్యాపకుల మాదిరి ఒక అంశంపై 'అభిప్రాయం – చర్చ'లు కూడా నిర్వహించరు. ఇక్కడ పిల్లల మధ్య, పిల్లలు–పెద్దల మధ్య మాటలు జరుగుతుంటాయి.

పిల్లలు – పెద్దల మధ్య ఈ మాటలు ఏ విధంగా మొదలవుతాయి? సాధారణంగా ఎవరైనా పిల్లవాడు పెద్ద వాళ్ళతో పని చేస్తూండగా సంభాషణ మొదలుపెడతాడు. ఇతరులు కూడా వచ్చి ఇందులో పాల్గొంటారు. చర్చ అటు, ఇటు మళ్ళుతుంటుంది. కొంత

మంది వెళ్ళిపోతే మరి కొంతమంది వచ్చి చేరుతుంటారు. వాళ్ళు రెండు – మూడు బృందాలుగా విడిపోవచ్చు. సంభాషణ ఎప్పటికీ పూర్తికాదు. కొంత సేపు నిలిచి పోయినా ఆలోచన కొనసాగుతూనే ఉంటుంది. మళ్ళీ ఎప్పుడో తిరిగి మొదలవుతూ ఉంటుంది.

చాలా బడులలో పీరియడ్ల మధ్య కొట్టే గంటలు, పాఠ్యక్రమం మొదలైన వాటివల్ల పిల్లల ఆలోచనల్లో అంతరాయం ఏర్పడుతుంది. ఇక్కడ అలాకాకుండా పిల్లల ఆలోచనల్లోనూ, పనుల్లోనూ అనుభవం యొక్క నిరంతరత (దీని గురించి డెనిసెన్ 'లైవ్స్ ఆఫ్ చిల్డ్రన్' అనే పుస్తకంలో చర్చించారు) ఉంటుంది. ఒకసారి చిన్నపిల్లలు పెద్దపిల్లల మాట వింటే, ఒకసారి పెద్దపిల్లలు చిన్నపిల్లల మాట వింటారు. అధ్యాపకుల సమావేశాల నుండి కూడా పిల్లలను వేరు చేయలేం. వారిని సమావేశంలోకి రమ్మని ప్రోత్సహించరు. ఒకవేళ ఎవరైనా వస్తే అతన్ని వెనక్కు వెళ్ళమని ఎవరూ చెప్పరు.

ఈ వివరణను టీచర్ ట్రైనింగ్ కాలేజీని నడిపేందుకు ఉపయోగపడే విధానంగానో లేక ఫార్ములాగానో భావించకండి. ఇదొక మానవీయ బృందం. దీనిని నిర్వహించడంలో పెద్దల చేయూత, సహకారం ఎంతో ఉంది. రెండు-మూడు విషయాలలో ఇక్కడి అధ్యాపకుల బృందం చాలా అసాధారణమైనది. మొదటి విషయం వీరిలో చదువు చెప్పగలగడమే కాకుండా ఇతర ఎన్నో నైపుణ్యాలు ఉన్నాయి. వీరిలో చాలామంది అధ్యాపకుల శిక్షణలో చేరకముందే ఎన్నో ఇతరపనులు చేసి, ఎన్నో అనుభవాలు పొంది ఉన్నారు. తమ ఈ అర్హత, అనుభవాలను వాళ్ళు బడికి తెస్తారు. వీరు ఎన్నో పనులు,

రకరకాల వస్తువులు చేయగలరు. అంతేగాక వస్తువులను బాగు చేయగలుగుతారు కూడా. ఏదో ఒకటి చేస్తూ ఉండటం పిల్లలకి ఇష్టంగా ఉంటుంది. రకరకాల పనులు చేయగలిగిన వారిని వాళ్ళు ఇష్టపడతారు, వారివైపు ఆకర్షితులవుతారు. ఈ అర్హత కారణంగా ఇటువంటి అధ్యాపకులను సహజంగా పిల్లలు గౌరవిస్తారు.

కొత్తబడులు అని చెప్పుకుంటున్న వాటిల్లో తరుచుగా అధ్యాపకుల పరిమిత సామర్థ్యాల కారణంగా చాలా సమస్యలు వస్తున్నాయి. యువ అధ్యాపకులు చాలామంది తాము పిల్లల్ని గౌరవిస్తూ ఉంటామని, వారితో స్వేచ్ఛగా పనిచేయటం తమ కిష్టమని నాతో చెబుతుంటారు. 'మీరు ఏం చేయగలరు' అని నేను అడిగినపుడు వారు ఆందోళన చెందుతారు. సాధారణంగా వారికి ఏమీ చేతకాదు. సంవత్సరాల తరబడి విద్యార్థులుగా ఉండటం తప్పించి వాళ్ళు ఏమీ

చేయలేదు. కాని కేవలం ప్రేమ, సద్భావనలు ఉంటే సరిపోదు. చాలా మంది పిల్లలు చాలాసార్లు ఇసుమంత నైపుణ్యం కోసం అమిత ప్రేమను కూడా వదులుకుంటారు. వీటికిమించి 'న్యూ లిటిల్ స్కూల్' అధ్యాపకులు తెలివైన వాళ్ళు, జిజ్ఞాసువులు. వీరికి ప్రపంచం గురించి ఎంతో తెలుసు, దానిగురించి ఆలోచిస్తూ ఉంటారు.

ఒక సర్వే ప్రకారం అమెరికన్ అధ్యాపకులలో చాలామందికి విషయ పరిజ్ఞానం గానీ, దాన్ని తెలుసుకోవాలనే ఉత్సుకతగానీ లేదని తెలిసింది. చాలా తక్కువ చదువుతారు. 'రీడర్స్ డైజెస్ట్' (అమెరికా, ఇతర దేశాల్లో చదవబడే సాధారణ పత్రిక) వారికి ఇష్టమైన పత్రిక. చాలా మంది అధ్యాపకులు సంవత్సరంలో ఒక పుస్తకం మాత్రమే చదువుతారు. బాగా చదివేవాళ్ళు కూడా కేవలం కాలక్షేపం నవలలు చదువుతారు.

ఆధునిక దేశాల్లోని సగటు వ్యక్తిలాగే వాళ్ళకూ ఎక్కువగా ఏమీ తెలియదు. అలాగే వాళ్ళు ఎక్కువగా ఏమీ చేయనూలేరు. ఏదో కొంత తెలిసినప్పటికీ, చేయగలిగినప్పటికీ దానిగురించి బడిలో ఎప్పుడో చర్చించరు, ఉపయోగించరు. ఇటువంటి వాళ్ళతో గడపడం ఆరోగ్యవంతులు, ఉత్సాహవంతులు, చలాకీ అయిన పిల్లలు ఇష్టపడతారా?

'న్యూ లిటిల్ స్కూల్' అధ్యాపకులకు తమ దేశమైన డెన్మార్క్ పట్ల ద్వేషం, భయంలేవు. ఇక్కడ నచ్చని విషయాలు ఎన్నో ఉన్నాయి. వాటిని మార్చాలన్న కోరిక వారికి ఉంది. కాని వారికి ఈ దేశమన్నా, అక్కడ నివసించటం అన్నా ఇష్టం. వారికి ప్రపంచం తోటి కూడా

ఎటువంటి విరోధం లేదు. ఎన్నిలోపాలు ఉన్నప్పటికీ ఇది సుందర, వైవిధ్య భరిత, మనసును దోచే ప్రదేశం. ఉత్సాహపూరిత, సాహస భరిత, లాభకరమైన ఎన్నో పనులు చేయవచ్చు.

తమ జీవితం గురించి కూడా వీరికి ఆందోళన లేదు. వీరిలో బలం, ఉత్సాహం ఉన్నాయి. జీవితంలో బాల్యం చాలా ఉత్తమమైనదని చెప్పి పిల్లలను చాలాకాలం పాటు బాల్యంలో ఉంచాలని వారికి ఉండదు. పిల్లలు పెద్దవారై, బలవంతులై ప్రపంచాన్ని చూడాలని, ఎంతో చేయాలని కోరుకుంటారని అధ్యాపకులకు తెలుసు. పిల్లలకు ఇందులో మద్దతివ్వడానికి అధ్యాపకులు ఉత్సాహంగా ముందుకొస్తారు.

ప్రత్యామ్నాయ బడులకు సంబంధించి ఎప్పుడూ ఇలా ఉండదు. బడి అధ్యాపకులుగా తమ జీవితం, తమ దేశం, తమ



చుట్టుపక్కల ప్రపంచంతో సంబంధంలేని యువతీ యువకులను తీసుకుంటుంటారు. వారి పట్ల నాకు సానుభూతి ఉంది. వారిని అర్థం చేసుకోగలను కాని అలాంటి అధ్యాపకులు పిల్లలకు కావలసినంతగా సహకరించలేరు.

పిల్లలకు ప్రపంచంతో ఏ గొడవా ఉండదు. వారికోసం ప్రపంచం ఉంది. వాళ్ళు ఈ ప్రపంచంలోకి రావాలనుకుంటారు. ప్రపంచం వ్యర్థమని, ఇక్కడ చెయ్యదగ్గ పనిలేదని, దీనినుండి బయటపడి ఎంతో దూరం పారిపోవడం మేలని వినడం పిల్లలకు ఇష్టం ఉండదు.

'న్యూ లిటిల్ స్కూల్' అధ్యాపకులు మంచి వారుగాను, పారదర్శకత కలవారుగా ఉండటం బహుశా అన్నిటికంటే ముఖ్య విషయమనిపిస్తుంది. అంటే పిల్లలు మాట్లాడాలనుకునే అన్ని విషయాలపై మాట్లాడటానికి వీరు సిద్ధంగా ఉంటారు. తమ ఆలోచనలను వారు ఉన్నది ఉన్నట్లుగా వ్యక్తపరచడమేగాక తమకు తెలియని విషయాన్ని తెలియదని అంగీకరిస్తారు. చాలామంది అధ్యాపకులు ఇలా చేయరు.

90శాతం అమెరికన్ అధ్యాపకులు బడులలో వివాదాస్పద విషయాల గురించి మాట్లాడడం ఇష్టపడరనీ, పిల్లలను కూడా ఈ విషయాల గురించి మాట్లాడనివ్వరని ఒక సర్వేలో తేలింది. పిల్లలకు ఈ విషయాలమీద చాలా ఆసక్తి ఉంటుందని అధ్యాపకులకు తెలుసు. అందుకనే సాంప్రదాయక బడులలోని పిల్లలు స్వేచ్ఛగా మాట్లాడలేరు. మాట్లాడినా తమకు నచ్చినట్లుగా, నిజాయితీగా మాట్లాడలేరు.

అంతేగాక శిక్షణ సమయంలోనే అధ్యాపకులకు తమ అజ్ఞానాన్ని, సందిగ్ధతను, సంశయాలను ఎప్పటికీ అంగీకరించ కూడదని బాగా తర్ఫీదు ఇస్తారు. పిల్లలను ఒక హద్దుమించి దగ్గరకు రానివ్వకపోవడం, వ్యక్తిగత జీవితం, భావాల గురించి బహిరంగంగా మాట్లాడకపోవటం లాంటివి అధ్యాపకుల నరనరాన జీర్ణమయ్యేలా చేస్తారు. కాని ఈ విషయాలలోనే పిల్లలకు జిజ్ఞాస ఉంటుంది, పెద్దవాళ్ళవ్వటం అంటే ఏమిటనేది దీని ద్వారా అనుభవంలోకి వస్తుంది.

'న్యూ లిటిల్ స్కూల్' పిల్లలు కొంతకాలం తరువాత సాధారణ బడులలో చేరి బాగా వృద్ధిలోకి వచ్చారు. దానికి ఎన్నోకారణాలున్నాయి. లోకం గురించి వాళ్ళలో కుతూహలం ఏర్పడుతుంది. దాన్ని గురించి తెలుసుకునే నేర్పు, విశ్వాసం వారిలో ఉంటాయి. సంవత్సరాల తరబడి రోజుకు ఎన్నో గంటలు చురుకుగా, గంభీరంగా మాట్లాడటమేగాక ఇతరుల మాటలు వింటూ భాషాపరమైన ప్రయోగంలో

సామర్థ్యం సంపాదించుకుంటారు. ప్రారంభిక సంవత్సరాలలో బడి వహించే ప్రధాన భూమిక ఇదే. అప్పటి వరకు బడిలో, బయట ఎన్నో సవాళ్ళను ఎదుర్కొన్న ఈ పిల్లలు సాధారణ బడులలో పరిమితంగా ఉన్న సవాళ్ళను చాలా సునాయాసంగా పరిష్కరించుకోగలుగుతారు.

చెవులను చురుకుగా ఉపయోగించే పిల్లలు సాంప్రదాయక బడుల అధ్యాపకులు ఏమి ఆశిస్తున్నారో ఇట్టే అర్థం చేసుకోగలుగుతారు. అదే బడిలో మొదటి నుంచి చదివిన పిల్లల కంటే వీళ్ళకు ఎన్నోరెట్లు ఎక్కువ విషయాలు తెలుసుకాబట్టి వాళ్ళకంటే వీళ్ళు ముందుంటారు.

ఇన్నేళ్ళు యధేచ్ఛగా వ్యవహరించిన పిల్లలు ఈ సాధారణ బడులను ఎలా భరించగలరనే ప్రశ్న ఎదురవుతుంది. వీళ్ళు ఆ బడులను అసహ్యించుకోరా? వాస్తవానికి వాళ్ళు ఆ బడులను ఏ మాత్రం ఇష్టపడరు. ఇవి తమకు సరిజోడుకావని తెలుసు. కాని ఈ పిల్లలు చాలా చతురులు, యథార్థవాదులు, ప్రపంచంలో ఏం కావాలన్నా, ఏం చేయాలన్న కాలేజీలు, విశ్వవిద్యాలయాలొక్కటే మార్గమని వాళ్ళకి బాగా తెలుసు. ఈ మార్గంలో ఎదురయ్యే సమస్యలను ఎదుర్కోడానికి వారు సిద్ధంగానే ఉంటారు. బడినుండి తమకు ఉపయోగపడే జ్ఞానాన్ని పొందడంలో ఇతర పిల్లల కంటే వీరు చాలా సమర్థులు.

'న్యూ లిటిల్ స్కూల్' గురించి తెలుసుకోవడం ఎంత బాగుందనుకున్నా అది కూడా ఒక బడేనన్న విషయం మరిచిపోకూడదు. దీని పద్ధతులను విదేశాల మాటటుంచి డెన్మార్క్‌లోని చాలా తక్కువ బడులు అనుసరించాయనేది వాస్తవం. ఇందుకు ఇది ఒక ప్రైవేటు బడి కావడం ఒక కారణం అయితే, డేనిష్ ప్రభుత్వ పాలనా వ్యవస్థలో భాగంగా ఇటువంటి బడి ఏర్పాటు చేయాలని లేకపోవడం రెండవ కారణం. అయినప్పటికీ చాలావరకు దీనికయ్యే ఖర్చులు ప్రభుత్వం ఇస్తుంది. ఒక నిర్ణీత సంఖ్యలో తల్లిదండ్రులు బడి ఏర్పాటు చేసి ఒక సంవత్సరం పాటు స్వయంగా నడిపినట్లయితే ఆ తరువాత

కాలం నుండి ప్రభుత్వమే స్వయంగా 85శాతం వరకు నిధులు భరించే ఒక చట్టం డెన్మార్క్‌లో ఉంది. మిగిలిన 15శాతం ఖర్చు స్వయంగా తల్లిదండ్రులే భరించాల్సి ఉంటుంది. ఇది కష్టమైన విషయమే. ఈ దేశంలోని ప్రజల్లో చాలామంది అతిపేదలు కానట్లే, అతి ధనవంతులు కారు.

పిల్లల చదువుకు డబ్బు ఖర్చుపెట్టే సాంప్రదాయం ఇక్కడ లేదు. ఈ చట్టంలో భాగంగా 'లిటిల్ స్కూల్' అన్న పేరుతో 40 చిన్న స్వతంత్ర బడులు తెరిచారు. ఇటువంటి చట్టం ఇతర ఏ దేశంలోనూ లేదు. ప్రభుత్వ సహకారం లేకుండా 'న్యూ లిటిల్ స్కూల్' అస్తిత్వం ప్రస్తుత రూపంలో కొనసాగేదికాదు. ఇక్కడి పిల్లల తల్లిదండ్రుల కంటే ఎన్నోరెట్లు ధనవంతులైన వారి సహకారం, ఆమోదాలపై ఈ బడి ఆధారపడక తప్పదు. తాము అభివృద్ధిచెందడం కంటే ఇతరులకు సహాయ, సహకారాలు అందించటంలో నమ్మకం, విశ్వాసమున్న బడికి సహాయం చేయాలని ఏ దేశంలోనైనా ధనవంతులు అనుకోరు.

బడికి ఎప్పుడు వెళ్ళాలి? ఎంత సమయం గడపాలి? అన్న విషయం పిల్లలు, వాళ్ళ తల్లి దండ్రులే నిర్ణయించటంవల్ల ఈ పరిస్థితిలో బడి నడవగలుగుతోంది. ఈ జిల్లా బడుల తనిఖీ అధికారి ఈ బడికి సంబంధించి సహకారం అందించాడు. కనీసం వ్యతిరేక చర్యలు తీసుకోడు. ఒకవేళ ఇదే బడి దేశంలో మరే ప్రాంతంలోనైనా ఉండి, వేరే తనిఖీ అధికారి ఉన్నట్లయితే దీనికి ఇంత అదృష్టం ఉండేది కాదు. అంతే కాదు చాలా విషయాల్లో చట్టం ప్రకారం నడుచుకోవలసివచ్చేది.

ఎటువంటి కోరిక, ప్రయత్నం లేకుండానే ఇది విజేతల, సఫలీకృతుల పాఠశాలగా ఎదిగిందని చెప్పవచ్చు. పైచదువులలో ఇక్కడి విద్యార్థులలో ఎక్కువమంది కాక కొద్దిపాటిమంది పిల్లలే ప్రతిభ కనబరచి ఉన్నట్లయితే చాలామంది తల్లిదండ్రులు తమ పిల్లల్ని ఇక్కడికి పంపించి ఉండేవారుకాదు. తాము ఎంచుకున్న మార్గం సరైనదన్న ఆత్మవిశ్వాసం చాలామంది అధ్యాపకులలో ఇప్పుడు ఏర్పడింది కాని అప్పుడు సందేహంలో పడి ఉండేవారు.

పిల్లలు, పెద్దలు కలిసి ఉండి పనిచేసే కొన్ని మార్గాలను తెలియచేయాలనే ఉద్దేశంతోనే నేను 'న్యూ లిటిల్ స్కూల్' గురించి చెప్పాను. ఒకరితో మరొకరు మాట్లాడగలగాలి, నేర్చుకోగలగాలి. లంచాలు, భయాలు లాంటివి లేని బడి ఉండాలి – సంక్షిప్తంగా చెప్పాలంటే 'బడిలేని' సమాజం ఉండాలి. మన బడులన్నింటినీ 'న్యూ లిటిల్ స్కూల్' లా మార్చాటానికి అనుమతిస్తే ఆ సమాజానికి అసలు బడుల అవసరమే ఉండదు, బడులు లేకుండానే పని జరుపుకోగలదు. 'న్యూ లిటిల్ స్కూల్' తరహాలో బడులు ఉన్న సమాజం పిల్లలు ఉండడానికి, పెరగడానికి చాలా మంచి, అందమైన ప్రదేశం. అయినప్పటికీ నేను ఆదర్శంగా భావించే దానికంటే ఇది ఎంతో దూరంలో ఉంది.

'న్యూ లిటిల్ స్కూల్' అందుబాటులో లేని ప్రాంతంలో, దూరంగా ఉంది. పిల్లల కోసమే ఏర్పాటు చేయబడిన ఈ ప్రదేశంలో తమ పూర్తి సమయాన్ని పిల్లలు గడపడం నాకు నచ్చదు.....పిల్లలు తమ సమయాన్ని తమతో ఉండేలా శిక్షితులైన వారితో గడపటం

కూడా నాకిష్టం ఉండదు. ఈ ప్రదేశం, ఈ మనుషులు ఎంత మంచి వైనప్పటికీ పిల్లలకు దీని కన్నా ఎంతో మెరుగైన, స్పష్టమైన, వారికి అందుబాటులో ఉండే ఒక సమాజం అవసరం. ఇందులో దాపరికం లేని, వయస్సుతో నిమిత్తం లేకుండా ప్రతి పౌరుడు చురుకైన, గంభీరమైన, బాధ్యతాయుతమైన పాత్రను నిర్వర్తించగలగడానికి హక్కుదారునిగా ఉండే వీలుండాలి. ఇటు వంటి సమాజ నిర్మాణం కోసం బడుల స్వరూపం మార్చడమే కాకుండా ఇంకా ఎంతో చేయ వలసిన అవసరముంది.

చదువులు - కొత్తదారులు

పేరు	రచయిత	అనువాదం	వెల రూ.
1. అపురూపమైన బడి	డా॥ అభయ్‌బంగ్	కె. మాధవి, యం. శ్రీనివాస్	4.00
2. మంచిబడి	డా॥ జాన్ హోల్ట్	టి. నరసింహులు	8.00
3. నీల్‌బాగ్ డేవిడ్	ఎస్. ఆనందలక్ష్మి, రోజాలిండ్ విల్సన్	టి. నరసింహులు	9.00
4. సరదా చదువు	అరవిందగుప్తా	కె. మాధవి, యం. శ్రీనివాస్	7.00
5. చదువుల ప్రయోగాలు	అరవిందగుప్తా	లావణ్య	7.00
6. చిలకమ్మ చదువు	రవీంద్రనాథ్ ఠాగూర్	పద్మాశేఖర్	4.00

ఆరు పుస్తకాల సెట్టు రూ.50/-

జన విజ్ఞాన వేదిక

మంచిపుస్తకం